పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : సర్పంచ్ శారద

విశాలాంధ్ర - డుంబ్రిగూడ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యకరంగా ఉండవచ్చని అరుకు పంచాయతీ సర్పంచి శారద అన్నారు. ఫ్రైడే డ్రై డే సందర్భంగా అరుకు పంచాయతీ. కేంద్రంలో మురుగు కాల్వలో ఉన్న చెత్తాచెదారాలను తొలగిస్తూ దీంతోపాటు పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఉన్న డ్రైనేజీల్లో పెరిగిపోయిన మురుగునీరుని శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వల్లి భా య్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.39 లక్షలు స్త్రీ నిధి రుణాలు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ సూచించారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశమందిరంలో 39 మంది లబ్ధదారులకు రు.39 లక్షలు చెక్కును పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఏ విధమైన వ్యాపారాలు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్డిఏ పిడి వి.మురళి, వెలుగు సిబ్బంది, పలువురు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ తప్పనిసరి

విశాలాంధ్ర - అనంతగిరి : మండలంలో పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ఉదయం సాయంత్రం విధిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ తెలిపారు. మండల పరిధిలో గురువారం నాడు కొండిబ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మండలంలో పనిచేస్తున్న వారు విధిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని ప్రతిరోజు ఈ సర్వీసెస్ సేవలు కనీసం 10కి తగ్గకుండా రిజిస్టర్ చేయాలని సూచించారు ప్రతి ఒక్క సచివాలయ సిబ్బంది వారి జాబ్ చార్ట్ మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. ఎవరు కూడా విధులు పట్ల నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. హౌసింగ్‌కి సంబంధించి ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలైన పి ఎంఏవై, పీఎం జన్మన్, ఎన్టీఆర్ గ్రామీణ హౌసింగ్ వంటి పథకాలతో 2016 నుండి 2024 వరకు మంజూరైన ఇల్లు పూర్తి చేసి వారికి బిల్లులు చెల్లించేందుకు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ చొరవ తీసుకుని ప్రతి ఒక్క లబ్ధిదారునికి అవగాహన కల్పించాలని తెలిపారు.

మండలంలో సమస్యల పరిష్కరించాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ

విశాలాంధ్ర - ఎటపాక : మండల సమస్యలు పరిష్కరించాలనీ సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ పేర్కొన్నారు. యటపాక మండలం లోని గన్నవరంలో సీపీఐ సమవేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పనులను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నందున పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వలన, వరదల వల్ల నష్ట పోయి, వ్యవసాయం పనులు లేకుండా పోయాయని, మా నాలుగు మండలాల్లో జాతీయ ఉపాధి హామీ పని 150 రోజులకు పెంచాలని కేవలం పోడు పట్టాలున్న కుటుంబానికి మాత్రమే 150రోజులు పని కల్పిస్తున్నారని, పోలవరం నిర్వశిత ప్రాంతం లోని ఉపాధి హామీ కూలీలందరికి 150 రోజులు పనిదినాలు పెంచాలని, మండలంలోనీ కొల్లూగూడెం నుండి మురుమూరు వరకు వున్న గ్రామాల ప్రజలకు మిగతా మండలాల వారికి ఇచ్చిన విధంగా జీవనభృతి 4800 రూపాయలు ఇవ్వాలన్నారు. యటపాకమండలం లోని పోలవరం ప్రాజెక్టు ముంపు భూములకు, గ్రామాలకు కాంటూరు తో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలని డిమాండ్ ఛేశారు. అంతే కాకుండా కొత్త పింఛన్ లు ఇవ్వాలని, ఇటివల కాలం లో మరణించిన అర్హులైన వారందరికీ చంద్రన్న భీమా వెంటనే అందించాలన్నారు. నాలుగు మండలాల్లో ఉపాధి హామీ పథకంలో కొత్తగా రోడ్లు డ్రైన్లు మంజూరు చేయాలనీ తెలిపారు. సచివాలయం జూనియర్ లైన్ మెన్ లను విద్యుత్ అధికారులు పంచాయతీ పనులు వీధి లైట్లు, మోటార్ ల పనులకు పంపడం లేదని, సర్పంచ్ లు గ్రామస్థులతో మాటలు పడుతున్నారని, ఈ విషయాన్ని త్వరలో పీవో దృష్టికి తీసుకొని వెళతామన్నారు. ఎంపీటీసీ కంటే రాజు మాట్లాడుతూ ఎంపీటీసీ పనులకు సంబందించిన అనుమతులు ఇవ్వకుండా ఎంపీడీఓ కార్యాలయం అధికారులు అలసత్వం వహిస్తున్నారని వెంటనే అనుమతులు ఇవ్వాలని లేదంటే ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామని అన్నారు. ఈ కార్యక్రమం లో గన్నవరం సర్పంచ్ గద్దం భద్రమ్మ, వల్లభనేని సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి యాలిశాల నాగరాజు, గద్దం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలులో నిరక్ష్యం చేస్తే చర్యలు

ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు.. విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - డుంబ్రిగూడ : ప్రభుత్వం అమలు చేస్తున్న భోజన మెనూలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పదని గిరిజన సంక్షేమశాఖ సహాయ అధికారి మల్లికార్జునరావు హెచ్చరించారు. మండలంలోని సొవ్వా గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో "అయ్యవార్లకు గుడ్డు ఫ్రై విద్యార్థులకు రుచి పచీలేనీ బంగాళదుంప కూర, నీళ్ల సాంబారు"అనే శీర్షిక విశాలాంధ్ర పత్రికలో ప్రచురితమైంది. స్పందించిన అధికార యంత్రాంగం స్థానిక ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు సొవ్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఆయన సందర్శించి భోజన మెనూతోపాటు రోజువారి మెనూ అమలు తీరుపై పరిశీలించారు. ప్రభుత్వ నిభందనల మేరకు విద్యార్థులకు సిద్ధం చేసిన పోషకాహారాన్ని కలిసి తీసుకోవాలని, ప్రత్యేకంగా వంట చేసి ఆచరించడం తగదన్నారు. ఇప్పటికైన భోజన మెనూ అమలు పక్కగా అమలయ్యేలా చూడాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాశరథి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తడి-పొడి చెత్త బుట్టలు వినియోగించుకోండి

విశాలాంధ్ర - జి.మాడుగుల : ప్రభుత్వం అందిస్తున్న తడి పొడి చెత్త బుట్టలు వినియోగించుకోవాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కిముడు కళ్యాణం సూచించారు. మండల కేంద్రం పాత ఎమ్మార్వో కాలనీ తీగల మెట్ట వీధిలో శుక్రవారం తడి పొడి చెత్త బుట్టలు పంపిణి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పరి సరాలు పరిశుభ్రంగా ఉంచు కోవాలని పంచాయితీ కార్యదర్శి రామ్ శంకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం. మత్యారాజు, రీమలి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగనవాడి కేంద్రం నిర్వహణపై కలెక్టర్‌కు నివేదిక

విశాలాంధ్ర - అనంతగిరి : మండలంలో ఉన్న అంగనవాడి కేంద్రాల నిర్వహణ మెరుగుపరచుకోవాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు. శుక్రవారం నాడు పల్లంవలస గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో సందర్శించారు. ఈ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడం, మేను సక్రమంగా నిర్వహించకపోవడం, అంగనవాడి కేంద్రం ముందు కనీసం కాలువకు పలక వేయకపోవడం చిన్నారులకు ఇబ్బందిగా ఉందని ఈ విషయలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు. అనంతరం పలవలస గ్రామంలో పీఎం జన్మన్ కింద మంజరైన హౌసింగ్ ను ఏఈ నాగేశ్వరరావు తో ప్రారంభించారు. మండలంలో 577 మంజూరు అయ్యాయని ఒక్కొక్కరికి రెండు లక్షల 78 వేలు కేటాయించినట్లు తెలిపారు. హౌసింగ్ విషయమై గతంలో నిలిచిపోయిన బిల్లులు కూడా త్వరలో మంజూరు అవుతాయని లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి సీతయ్య పాల్గొన్నారు.

24 నాలుగు గంటల్లో అర్జీలు పరిశీలించకపోతే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్‌కుమార్ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : అర్జీదారుల నుండి స్వీకరించిన అర్జీలను శాఖాధికారులు ఇరవై నాలుగు గంటలల్లో వెబ్సైట్లో పరిశీలించక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. సమీకృత గిరిజ నాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యలు పరిష్కార వేధికలో 166 ఫిర్యాదులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ్, ఐటిడి ఏ పి ఓ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ తో కలిసి వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారుల వినతుల పరిశీలన చేయకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఫిర్యాదులు పరిష్కారానికి అధికారులు జవాబుదారీగా ఉండాలని అన్నారు. రహదారుల నిర్మాణాలు, సిసి రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు, అటవీ హక్కు పత్రాలు, ఉపాధి అవకాశాల కోసం ఎక్కువగా ఫిర్యాదు అందాయి.

మృతి చెందిన శ్రీను కుటుంబానికి సీఐటీయూ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - అరకులోయ : అరకులోయ సి కాలనీ చెందిన పెయింటర్ కొర్ర శ్రీను అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. శ్రీను కుటుంబానికి తేజావలి పెయింటర్ అసోసియేషన్ (సిఐటియు) వారు 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, యూనియన్ అధ్యక్షులు కొండలరావు కార్యదర్శి దాసు, గోపి, రాజేంద్ర సుంకరమెట్ట ప్రెసిడెంట్ చిన్న బాబు చేతుల మీదుగా నగదు అందించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ శ్రీను సిఐటియు భవన నిర్మాణ రంగంలో చురుకుగా పనిచేసేవారిని కరోనా సమయంలో ప్రజలను చైతన్యం చేయడంలోనూ తన వంతు సహకారం అందించడంలోని ముందుండేవాడని తెలిపారు. సంఘానికి శ్రీను మరణం తీరనిలోటుని అన్నారు . వారి కుటుంబానికి సంఘంతో పాటు సిఐటియు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు కుటుంబానికి సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వీర్రాజు, సుధా, అప్పారావు, తదితరులుసభ్యులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర - బెలగాం : గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు గుమ్మలక్ష్మిపురం మండలం బయ్యాడ గ్రామానికి చెందిన గిరిజనులతో కలసి ఐటిడిఏ పిఓ అశుతోష్ శ్రీ వాత్సవకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ బయ్యాడ గ్రామానికి రేగిడి నుండి పక్కా రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. రహదారి సౌకర్యం లేకపోవడం వలన వ్యాదులు ప్రభలే సమయం లో వైద్యం కోసం నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. గ్రామానికి రోడ్డు లేకపోవడం వలన అంగన్వాడీ భవనం, పాఠశాల భవనం కూడా పూర్తి కాక ఇళ్లలోనే పాఠశాల తరగతులు నిర్వహిస్తు న్నారని వాపోయారు. గ్రామంలో సురక్షితమైన తాగునీరు కూడా లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఐటిడిఏ పిఓ మాట్లాడుతూ గ్రామాన్ని సందర్శించి సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బయ్యాడ గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబరు నిమ్మక రంగారావు, గ్రామానికి చెందిన జీలకర్ర సోమాలు, నిమ్మక ప్రకాష్, నిమ్మక కామేష్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

మన్యం జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షురాలు బలగ

విశాలాంధ్ర - సాలూరు : వాలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకొని ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం అమలుచేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఏఐటియుసి ఉపాధ్యక్షురాలు,ఏపీ మహిళా శ్రామిక ఫోరం జిల్లా కన్వీనర్ అయిన బలగరాధ డిమాండ్ చేశారు.శుక్రవారం సాలూరు పట్టణంలోని కొంకివీధి కళ్యాణమండపం వద్ద వాలంటీర్లతో ఏఐటియుసి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం లో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లను విధుల్లోకి తీసుకొని రూ.10 వేల రూపాయలు గౌరవ వేతనం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో కూడా విశేష సేవలు అందించిన వాలంటీర్లను కూటమి ప్రభుత్వం విస్మరించడం శోచనీయమన్నారు.తక్షణమే వాలంటీర్లను విధుల్లోకి తీసుకొని నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలన్నారు.వాలంటీర్లను ప్రభుత్వం విధుల్లోకి తీసుకోక పోతే త్వరలో జిల్లా కేంద్రం లో ధర్నా చేపట్టి పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమం లో ఆమెతో పాటు పట్టణంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

తగ్గించిన పాలసేకరణ ధరను పెంచాలని రహదారిపై రాస్తారోకో

విశాలాంధ్ర - సీతానగరం : విశాఖ పాల డైరీ పాల సేకరణ ఐదురూపాయలు ధరను తగ్గించి రైతుల ఆదాయాలకు గండి కొట్టడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం నాడు మండలంలోని కాశాపేటలోని పాల సేకరణ(బల్క్ సెంటర్) కేంద్రం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకోని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ విశాఖ డైరీకి పాలు సేకరిస్తున్న రైతులకు అర్ధాంతరంగా ఆవుపాల ధరను తగ్గించి రైతులపై పెనుభారాన్ని మోపడాన్ని రైతులంతా వ్యతిరేకించాలని, ఇప్పటికే పాల సేకరణ రైతులకు ఇవ్వాల్సిన బోనస్ నివ్వకుండా విశాఖ డైరీ ఎగ్గొట్టారని అన్నారు. ఒకవైపు పశుదానాకు విపరీతంగా ధరపెంచి రైతులుపై భారాలు మోపుతున్నారన్నారు. అంతే కాకుండా పాల రైతుల డబ్బులతో డైరీకున్న ఆస్తులు పాలకవర్గం ఇష్టానుసారంగా ఖర్చుచేస్తూ అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందన్నారు. ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని, పాల రైతులకు ఇవ్వాల్సిన బోనస్ విషయంలో పాల సేకరణ ధర విషయంలో మాత్రం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, ఈప్రాంతంలో ఉన్న చక్కెర కర్మాగారం లాంటి దుస్థితిని, విశాఖ డైరీ కి పట్టించి తద్వారా ప్రైవేట్ డైరీ యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. డైరీ యాజమాన్యం తగ్గించిన పాలసేకరణ ధర పెంచకపోతే ఈనెల 29న విశాఖ డైరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి, రైతు సంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, బంటు దాసు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, పాడి రైతులు బి. ధనుంజయ, పైల విశ్వనాథం, సిరికి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని సన్మానించిన సర్పంచ్, సచివాలయ సిబ్బంది

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని చినబోగిలి గ్రామ సచివాలయంలో విశేష సేవలందించి గాదెలవలసకు బదిలీపై వెళ్లిన మనోహర్ ను సర్పంచ్ కురమాన రాధశ్రీనివాసరావు దంపతులతో పాటు సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు ఘనముగా సత్కరించారు. మనోహర్ సేవలను కొనియాడారు. తన విధి నిర్వహణలో మనోహర్ సక్రమంగా గ్రామానికి సేవలు అందించాలని తెలిపారు. ఆయనతోపాటు బదిలీపై వెళ్లిన డిజిటల్ అసిస్టెంట్ తేజేశ్వరి, లైన్మెన్ జనార్ధన్ లను సన్మానించి వారిసేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతిరావు, నాయకులు జగన్నాథం, వెంకట నాయుడు, రాంబాబు, రమేష్, శంకర మాస్టారు, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకొని చెరకు పంట దగ్ధం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలోని కుందర తిరువాడ గ్రామ సర్పంచ్ ముదిలి పెద్దినాయుడుకు చెందిన సుమారు రెండు ఎకరాల చెరకు పంట నిప్పంటుకొని దగ్ధమైంది. గురువారం రాత్రి ఈ సంఘటన కుందర తిరువాడ పంట పొలంలో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానిక కుందర తిరువాడ, చిన కుదమ రైతులంతా కలిసి మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో గాలి లేకపోవడం వలన సుమారు మరో 40 ఎకరాల చెరుకు రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం తప్పిందిన్నారు. నిప్పంటుకున్న చెరకు పంటను రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు పరిశీలించి తమకు నష్టపరిహారం అందించాలని వారు అధికారులను కోరుతున్నారు.

పశుసంపద వృద్ధి ద్వారా రైతు ఆదాయం పెరుగుతుంది : జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : జిల్లాలోని పశుసంపద మరింత వృద్ధి చెంది, తద్వారా రైతుల ఆదాయం పెరిగి ఆర్థిక వృద్ధి చెందేలా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పశు వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక పశు వైద్యశాల సమీపంలోని ప్రైవేట్ డెయిరీ ఫారం వద్ద 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పశుగణన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పశువుల గణాంకాల కార్యక్రమాన్ని చాలా జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగనున్నందున అప్పటివరకు జిల్లాలోని ప్రతి ఇంటిని సందర్శించి, పశువుల సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు.దీనివలన పశుగణ రంగ పథకాల రూపకల్పన కు సహకరిస్తుందని చెప్పారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా రోజుకు 10వేల లీటర్ల పాలు,10వేల కిలోల మాంసం విక్రయాలు జరుగుతున్నాయని, ఇది మరింత పెరిగేలా కృషిచేయాలని అధికారులను కోరారు.రైతుల వ్యయాన్ని తగ్గించి, అధిక ఆదాయం వచ్చే మార్గాలపై తగిన సూచనలు చేయాలని, వాటి ద్వారా తలసరి ఆదాయం పెరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి ఏటా 15 శాతం ఆర్థిక వృద్ధి ఉండేలా ప్రణాళికలు రచించాలని ఆదేశించిన విషయాన్ని కలెక్టర్ గుర్తుచేసారు. జిల్లాలోని ప్రతి ఇంటిని సందర్శించి రైతుతో మాట్లాడి పశు గణాంకాల వివరాలతో, వాటి ద్వారా లభించే ఆదాయ వివరాలను కూడా సేకరించాలని అన్నారు. ఇంటిని సందర్శించినట్లు ప్రభుత్వం జారీచేసిన స్టిక్కర్లను ఖచ్చితంగా అతికించాలని చెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనలో వాటిని పరిశీలిస్తామని, ఎక్కడైనా కనిపించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికంగా పశు సంపదను ప్రోత్సహిస్తూ, వాటి ద్వారా ఆదాయం పొందుతున్న డెయిరీ పారం యజమాని నర్సింనాయుడును కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఉత్తమ రైతు అవార్డును ప్రకటించాలని, ఈసారి అవార్డు కోసం సిఫారసు చేయాలని పశు సంవర్ధక అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పశు రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం పశు వైద్యాధికారులకు మైక్రో స్కోపులను, గణాంక అధికారులకు లైవ్ స్టాక్ సెన్సస్ బ్యాగులను కలెక్టర్ పంపిణీ చేసారు. 21వ అఖిల భారత పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత గోపూజా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య శాఖాధికారి డా. యస్. మన్మథరావు,సహాయ సంచాలకులు డా. ఎం.ప్రసాద్, డా. సిహెచ్.దీనకుమార్, ఇతర వైద్యాధికారులు, పశు గణన అధికారులు, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

పాలకులు మారినా కార్మికుల జీవితాలు మారడం లేదు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : పాలకులు మారినా కార్మికుల జీవితాలు మారడం లేదని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు.శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపులో భాగంగా ఈరోజు ఈ నిరశన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని స్థానిక సమస్యలపైన చట్టబద్ధమైన సెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు. డెత్ సిక్ పోస్టులలో బిడ్డలకు ఉద్యోగాలు, సాధారణ, ప్రమాద మరణాలకు ఎక్స్ గ్రేషియా చెల్లింపులు, కార్మికులు ఉమ్మడి రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పోరాడి సాధించుకున్న వారాంతపు శలవులు, క్యాజువల్ లీవులు, జాతీయ శలవులు సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు.కార్మికుల పైన రోజురోజుకి పరిభారం పెరుగుతుందని దొడ్డిదారిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఇళ్లల్లో పని చేయించుకోవడం జరుగుతుందన్నారు. పాలకులు ఎంతమంది మారినా మున్సిపల్ కార్మికుల జీవితాలు మారడం లేదని అన్నారు. ఇందులో భాగంగా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల నుండి సంతకాలు సేకరణ, 25, 26వ తేదీల్లో మస్టర్ పాయింట్ల వద్ద ధర్నాలు 27వతేదీన ఎమ్మెల్యే, చైర్పర్సన్ ఇంటి వద్ద సామాజిక రాయబారంలు 28వ తేదీ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాలు కమిషనర్‌కి వినతి పత్రములు ఇవ్వడంజరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటియు నాయకులు జి.వెంకటరవణ కార్మికులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లో ఓపెన్ హౌస్ పై అవగాహన

విశాలాంధ్ర - సీతానగరం : పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమ వారోత్సవాలు సందర్భంగా సీతానగరం పోలీసులు ఓపెన్ హౌస్ పై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారం రోజులపాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్ఐ లంక శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది సుజాత, పద్మ, జయలక్ష్మి, రామకృష్ణ, అప్పలకొండ, ప్రసాద్, గ్రామ ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్ స్పెక్టర్ పి.అనీష్ ఆధ్వర్యంలో చినమేరంగి జిల్లా పరిషత్ హైస్కూల్ లో వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని వారిని స్మరించుకునే కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ నిరోధంలో యువత పాత్ర అనే దానిపై ఈ వ్యాసరచన పోటీలు జరిపినట్లు ఎస్ఐ అనీష్ తెలిపారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు త్వరలో సబ్ డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు.

వైసీపీ నుండి జనసేన పార్టీలోకి భారీగా చేరికలు

విశాలాంధ్ర - జీకే వీధి : మండలంకు చెందిన పలువురు వైసిపి నాయకులు జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ వంపూరు.గంగులయ్య ఆధ్వర్యంలో ఘనంగా జనసేన పార్టీలో చేరారు.. ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ గత వైసీపి ప్రభుత్వంలో నిధులు లేక పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేక పోయారని అధికారం ఉన్నప్పటికీ కక్ష సాధింపు చర్యలు చేపట్టారు అని అభివృద్ధి నోచుకోలేని ఎన్నో గ్రామాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు...., ఇప్పుడున్న జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు ఆశయాలు నచ్చి ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న నిజాయితీగల నాయకులని స్వచ్ఛమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్న నాయకులు పవన్ కళ్యాణ్ అని ఆయన సిద్ధాంతాలకు ఆకర్షితులు అయ్యి జనసేన పార్టీలోకి చేరడం చాలా సంతోషాన్ని కలిగించిందని ఆనందం వ్యక్తం చేశారు... అలాగే గాంధీ కళలు కన్న స్వరాజ్యం, పంచాయతీ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న పవన్ కళ్యాణ్ ప్రతి ఒక్కరు గ్రామ అభివృద్ధికి కృషి చెయ్యాలంటే పవన్ కళ్యాణ్ వల్లనే సాధ్యమని, గ్రామ అభివృద్ధికి సరి కొత్త శ్రీకారం చుట్టిన మీకు ధన్యవాదములు తెలుపుతున్నాం అన్నారు. అలాగే జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు ముందుకు తీసుకెళ్ళే బాధ్యత మనమీద ఎంతైనా ఉందని తెలిపారు.. అలాగే వైసీపి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తూ గత వైసీపి ప్రభుత్వంలో నిర్వీర్యంగా ఉండిపోయామని, గిరిజన ప్రాంత అభివృద్ధికి ముందుకు రావాలంటే అది జనసేన పార్టీతోనే సాధ్యమని అన్నారు.. అలాగే మాకు అధికారం శాశ్వతం కాదని అలాగే గిరిజన ప్రాంత ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజల పక్షాన నిలబడే బాధ్యత మా మీద ఎంతైనా ఉందని, మమ్మల్ని నమ్మిన ప్రజలకు అండగా ఉండేందుకు జనసేన పార్టీ కీలక మైనది అని నమ్మి జనసేన పార్టీ తీర్థం పుచ్చుకోవడం జరిగింది, అని అన్నారు... ఈ కార్యక్రమంలో విశాఖ రూరల్ జిల్లా ఉపాధ్యక్షులు కిట్లంగి. పద్మ, అధికార ప్రతినిధి బోనుకుల దివ్యలత, జనసేన పార్టీ పాడేరు ఐటీ ఇంచార్జ్ సాలేబు.అశోక్,సీనియర్ నాయకులు పాంగి.శివాజీ, జనసేన పార్టీ ఐటీ టీమ్ కో ఆర్డినేటర్ సీ.హెచ్.అనిల్ కుమార్, మండల నాయకులు తరడ.రమేష్ నాయుడు, వసుపూరి. ప్రసాద్ డిస్ట్రిక్ట్ ఎక్సిక్యూటివ్ మెంబర్, పాంగి కృష్ణారావు సర్పంచ్ పెదవలస, కోరోజు త్రిమూర్తులు ఏఎంసి ఫిటెక్టర్ జొంజు. బాలరాజు వార్డు మెంబర్ పెదవలస, గుంట. త్రినాథ్ వార్డు మెంబర్ పిల్లగొంది, పెదవలస, కంశీల కోట వెంకట రమణ కన్వీనర్, దేశగిరి వెంకన్న పడాల్ రింతాడ, వంతాల. రాజుబాబు, గేమ్మెలి. దొరబాబు, వార్డు మెంబర్ పెదవలస, జనసేన నాయకులు,జనసైనికులు, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సిబ్బంది సహకరించాలి : ఎంపీడీవో శ్రీనివాస్

విశాలాంధ్ర - మారేడుమిల్లి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పలు రకాల కార్య క్రమాలపై గ్రామ సచి వాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో శ్రీనివాస్ విశ్వనాద్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ప్రజల నుండి అందుకున్న ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్లోరినేషన్ జరిగిన తర్వాతనే ప్రజలకు త్రాగు నీరు అందించాలన్నారు. వెల్ఫేర్ సహాయకులు ప్రతి సోమ గురు వారాల్లో విధిగా పాఠశాలలను సందర్శించి టాయిలెట్స్, త్రాగునీరు, పరిసరాలు పరిశుభ్రతను పరిశీలించాలని సూచించారు. జల జీవన్ మిషన్ ద్వారా పూర్తికాని పనులు త్వరితగతిని చేపట్టాలని, అంగన్వాడి కేంద్రాలలో మంజూరైన మరుగుదొడ్లను అనుకున్న సమయానికి నాణ్యత లో రాజీ పడకుండా పూర్తిచేయాలన్నారు. మహిళా సంఘాలకుకొత్త రుణాలు మంజూరు చేసి వ్యక్తిగత వ్యాపారంను ప్రోత్సహించాలని అదే సమయంలో రుణ బాకీలు కూడా రికవరీ చేయాలని కోరారు . ఉపాధి హామీ పథకం సక్రమంగా జరగాలని ఇబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి ఎం రత్నకుమారి. ఏ ఈ ఆర్ డబ్ల్యూ ఎస్ జి నారాయణరావు, ఏబీఎన్ సుధాకర్, ఏపీవో రెడ్డి బాబు, సెక్రెటరీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - జీకే వీధి : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు. మండల ఎంపీపీ బోయని కుమారి, సర్పంచ్ నడిగట్ల రాజు, పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి, రీంతాడ పంచాయితీ వైస్ సర్పంచ్ మడపల సోమేశ్ కుమార్, కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి అరుణ కుమార్, దామన్నపల్లి పంచాయతీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు కుందేల శుక్రవారం రీంతాడ పంచాయతీ పరిధి ఈదులబంధ దామనపల్లి పంచాయతీ పరిధి దొడ్డికొండ, దారకొండ పంచాయతీ పరిధి రోలుగుంట గ్రామంలో సచివాలయల సిబ్బంది, గ్రామస్తులతో కలిసి ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈదులు బంధ ,దొడ్డి కొండ, రోలుగుంట, గ్రామస్తులు గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను చెత్తాచెదారం ను తొలగించారు. ఈ కార్యక్రమంలో మూడు పంచాయతీల కూటమి నాయకులు, ఎంపీటీసీ రామన్న,,ఉప సర్పంచ్ మడపల సోమేశ్ కుమార్, గెమ్మెల చిలకమ్మ, నాచెల పాండురాజ్, బొబ్బిలి వెంకట్రావు, పాతని లక్ష్మణరావు, రాంబాబు, వెంకట, క్లాస్ మిత్రులు, గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది, ఆశ, అంగన్వాడి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణం పూర్తి చేయరా...?

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థలో స్థితిలో ఉండి వైద్యులు,సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నతాధి కారులు సందర్శన సమయంలో కొత్తభవనం త్వరితగతిన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతప్రభుత్వంలో నాడు- నేడు ద్వారా కోటి 60లక్షల నిధులతో గుత్తేదారు సగం పనులుచేసి మధ్యలో వెళ్ళిపోయారు. గత గుత్తేదారుకు 50లక్షల రూపాయల వరకు బిల్లులు చెల్లించారని తెలుస్తోంది. ఇంకా కోటి రూపాయలు వరకు పనులు ఉన్నాయి. ఆర్ అండ్ బి పర్యవేక్షణలో ఈ పనులు జరిగాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త ఆసుపత్రి భవనం సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సీతానగరమండల ప్రధానికం కోరుతుంది. మండల కేంద్రంలో సేవలు అందించే ప్రస్తుత ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది, రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి అధికార యంత్రం తగుచర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

రోడ్డున పడ్డ కేజీబీవీ గెస్ట్ టీచర్ల కుటుంబాలు

- అగమ్య గోచరంగా తయారైనా కేజీబీవీ గెస్ట్ టీచర్ల పరిస్థితి
- శుక్రవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్కు మొరపెట్టుకున్న కేజీబీవీ గెస్ట్ టీచర్లు

విశాలాంధ్ర - పాడేరు రూరల్ : గత తొమ్మిది సంవత్సరాలుగా కేజీబీవీ పాఠశాలలు, కాలేజీల యందు పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టర్ గెస్ట్ టీచర్లు శుక్రవారం నాడు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఐటిడిఎ కార్యాలయం నందు నిర్వహించినటువంటి గ్రీవెన్స్‌లో వారి బాధలను కలెక్టర్ కు మొరపెట్టుకున్నారు. తొమ్మిది సంవత్సరాలుగా క్రమం తప్పకుండా కేజీబీవీల్లో పనిచేసినటువంటి మమ్మల్ని పరిగణలోకి తీసుకోకుండా కేజీబీవీల్లో నూతనంగా కొత్తవారిని నియమించడ వలన ఇన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి గెస్ట్ టీచర్లు కుటుంబాలు మొత్తం రోడ్డుపై పడే పరిస్థితి వచ్చిందని కొత్తగా నియమించే టీచర్లలో కూడా స్థానికులను కాదని 37 పోస్టులకు 36 పోస్టులు గిరిజనేతరులకు కల్పించడం వలన ఎంతోకాలం నుంచి పనిచేస్తున్నటువంటి స్థానిక గిరిజన టీచర్లు, నిరుద్యోగులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని,దీనిపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తక్షణంగా స్పందించి కేజీబీవీలో గిరిజనులకు జరుగుతున్నటు వంటి అన్యాయంపై చర్యలు తీసుకుని ఎంతోకాలంగా కేజీబీవీలో పనిచేస్తున్నటువంటి స్థానిక గిరిజన గెస్ట్ టీచర్లకు ప్రాధాన్యతనిచ్చి కేజీబీవీల్లో పోస్టింగులు ఇపించాలని జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కేజీబీవీ గెస్ట్ టీచర్లు అరకు పాడేరు రంపచోడవరం తదితర ప్రాంతాల నుండి తరలివచ్చి కలెక్టర్ కి వినతి పత్రం (రిప్రజెంటేషన్) ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దీనిపై ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్ స్పందించి గిరిజనులకు అన్యాయం జరగకుండా చూడాలని స్థానిక ఉపాధి అవకాశాలు వెనుకబడిన గిరిజనులకు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరడం జరిగింది.

నేత్ర శస్త్ర చికిత్సలకు తరలింపు

విశాలాంధ్ర - కురుపాం : పుష్పగిరి కంటి ఆసుపత్రిలో గత వారం శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి శుక్రవారం వారంతర చికిత్సలు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో 15 మందికి నేత్ర తనిఖీలు నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి నిర్వహించారు. దృష్టి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. పరీక్షలు అనంతరం ఎంత జాగ్రత్తగా ఉండాలి, ఏమి ఆహారం తీసుకోవాలి తదితర జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కురుపాం మరియు గుమ్మలక్ష్మీపురం మండలం పరిధిలో వున్న సచివాలయంల పరిధిలో వున్న గ్రామాలలో గతంలో నిర్వహించిన నేత్ర పరీక్షలు లలో కేటరాక్ట్(అంతర కుసుమం) టేరిజియం(కొయ్యకండ) వున్న వారిని 28 మందిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం ఈ రోజు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నుండి పుష్ప గిరి కంటి ఆసుపత్రి విజయ నగరం కి తరలించి రేపు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు.వీరందరికీ ఉచిత రవాణా,వసతి, భోజనం, కళ్ళ జొల్లు,మందులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శస్త్ర చికిత్సలు కు వెళుతున్న రోగులకు పలు సూచనలు, జాగ్రతలు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా మా లాంటి పేదలకు కంటి చూపును తెప్పించే బాధ్యతగా తీసుకొని మాకు దగ్గర వుండి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న జిల్లా అందత్వ నివారణ సంస్థకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర రజని, సురేష్ మరియుఆషా కార్య కర్తలు పాల్గొన్నారు.

ఏనుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : మండలంలోని బొండపల్లి, గదబవలస గ్రామాల సరిహద్దుల్లోని వంటపొలాల్లో ఏనుగులు గుంపు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం గ్రామీణ ఎస్సై సంతోష్ కుమారి తెలిపారు. గురువారం నాడు ఏనుగుల గుంపు వలన బొండపలి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందేనని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఏనుగులు గుంపును కవ్వించవద్దని, ఏనుగుల వైపు వెళ్ళవద్దని సూచించారు. రాత్రిపూట ప్రజలు బయటికి రావద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదసారులు తగుజాగ్రత్తలు తీసుకొని వెళ్లాలన్నారు.

పశు అక్రమ రవాణాపై చర్యలు

విశాలాంధ్ర - పార్వతీపురం : పశు అక్రమ రవాణాపై సమాచారం మేరకు చర్యలు తీసుకుంటామని జిల్లా పశు సంవర్థక అధికారి డా.ఎస్ మన్మథరావు తెలిపారు. జిల్లా నుండి ఇతర ప్రాంతాలకు పశు అక్రమ రవాణా విషయమై ఫిర్యాదులు, సమాచారం దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, మార్కెటింగ్ శాఖ, రోడ్డు రవాణా శాఖ, జంతు సంరక్షణ కమిటీ సహకారంతో బాధ్యులపై చర్యలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. జిల్లాలో అన్ని పశు వైద్య కేంద్రాల పరిధిలో రైతులకు పశువైద్య సేవలు అందజేయడం జరుగుతుందని జిల్లా పశుసంవర్థక అధికారి మన్మథరావు తెలిపారు. పశువైద్య కేంద్రాలకు అవసరమగు నూతన భవన నిర్మాణాలు, మరమ్మత్తులు చేపట్టుట నిమిత్తము పైఅధికారులకు నివేదిక సమర్పించడం జరిగిందని ఆయన చెప్పారు.

పశు గణనకు సహకరించండి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలో ఈనెల 25వ తేదీ నుండి 28వ తేదీ ఫిబ్రవరి 2025 వరకు 21వ అఖిల భారత పశుగణన చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎన్. ముని కుమార్ తెలిపారు. దీనికి మండలంలో ప్రతి ఒక్కరూ సహక రించాలని ఆయన కోరారు. మండలం మొత్తంలో 13,189 కుటుంబాలకు సంబంధించి పశుగణన చేస్తున్నామని అన్నారు. శుక్రవారం వెంకటరాజుపురం గ్రామంలో దీనికి సంబంధించిన గోడ పత్రికను టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణాధికారి దత్తి లక్ష్మణరావు చేతుల మీదుగా ఆవిష్కరించి అక్కడ నుండే ఈ పశుగణన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హౌసింగ్‌పై లబ్ధిదారులకు అవగాహన

ఎంపీడీవో ఏవీవీ కుమార్

విశాలాంధ్ర - అనంతగిరి : మండలంలో ఉన్న అంగనవాడి కేంద్రాల నిర్వహణ మెరుగు పరచుకోవాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు. శుక్రవారం నాడు వల్లంవలస గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో సందర్శించారు. ఈ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడం, మేను సక్రమంగా నిర్వహించక పోవడం, అంగనవాడి కేంద్రం ముందు కనీసం కాలువకు పలక వేయకపోవడం చిన్నారులకు ఇబ్బందిగా ఉందని ఈ విషయలపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. అనంతరం పలవలస గ్రామంలో పీఎం జన్మన్ కింద మంజరైన హౌసింగ్ ను ఏఈ నాగేశ్వరరావు తో ప్రారంభించారు. మండలంలో 577 మంజూరు అయ్యాయని ఒక్కొక్కరికి రెండు లక్షల 78 వేలు కేటాయించినట్లు తెలిపారు. హౌసింగ్ విషయమై గతంలో నిలిచిపోయిన బిల్లులు కూడా త్వరలో మంజూరు అవుతాయని లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి సీతయ్య పాల్గొన్నారు.

ఈనెల 30న ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి యస్. వేంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్ బాల్, ఖో- ఖో, బెస్ట్ ఫిజిక్, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్ క్రీడలలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఆర్ సి యం స్కూల్ కాంప్లెక్స్ వద్ద ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ఉద్యోగులను నవంబరు 6నుండి 9వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని ఆయన చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయి క్రీడా పోటీలకు రాష్ట్రం తరపున పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల సివిల్ సర్వీస్ ఉద్యోగులు తమ డిపార్ట్ మెంట్ గుర్తింపు ఐడి కార్డుతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో సివిల్ సర్వీస్ ఉద్యోగులు ఈఅవకాశాన్ని వినియెగించుకొని క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోగలరని కోరారు.

రూ.7 లక్షలతో బైపాస్ రోడ్డు మరమ్మతు పనులకు ప్రతిపాదనలు

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం బైపాస్ రోడ్డు మరమ్మతులు కొరకు రూ.7 లక్షల రూపాయలతో ప్రతిపాదనలు పంపామని, అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామని ఆర్ అండ్ బి ఈఈ బి.రాజేంద్ర కుమార్ తెలిపారు. పార్వతీపురం బైపాస్ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన, పునరుద్ధరణలు లేకపోవడం వల్ల కొన్ని చోట్ల రోడ్లు పాడైందని అన్నారు. కొన్నిచోట్ల డ్రైనేజీ సరిగా లేకపోవడంతో వర్షం నీరు నిలిచి రోడ్డు దెబ్బ తింటోందని తెలిపారు. ఇంటెన్సివ్ ప్యాచ్‌వర్క్ కోసం రూ.7.00 లక్షలతో ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపామని, పరిపాలన అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

ఏనుగు దాడి మృతుని కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం

ఎమ్మెల్యే విజయ్ చంద్ర

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : ఏనుగుల దాడిలో మరణించిన యాకోబ్ కుటుంబానికి 10 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వృద్ధుడు మృతి చెందడం చాలా బాధా కరమని ఆయన లేని లోటు తీర్చలేమని ఎమ్మెల్యే అన్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అటవీశాఖ అధికారులు తక్షణము స్పందించి కుటుంబానికి 10 లక్షల ఎక్స్గ్రేషియా మంజూరు చేశారని ఎమ్మెల్యే వివరించారు.కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరు ఎటువంటి ఇబ్బంది పడకూడదన్న ఆశయంతో బాధలో ఉన్నవారికి ప్రభుత్వం చేయూత అందించి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. అందుకు ఏనుగు దాడిలో మృతి చెందిన కుటుంబానికి మంజూరు చేసిన పది లక్షలు ప్రభుత్వ నిబద్ధతకు అర్థం పడుతుందని అన్నారు. గ్రామస్తులు అంతా సహకరించాలని ఎవరు ఏనుగులను ఫోటోలు, వీడియోలు తీయడం వంటి చేయవద్దని ఎమ్మెల్యే కోరారు. వన్యప్రాణుల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారిని ప్రసూన, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ ముగుస్తుండడంతో అమేజాన్ పే రాయితీలు

విశాలాంధ్ర - పాడేరు : అమేజాన్ పే ఈ చివరి నిముషం లావాదేవీలను నిరంతరంగా, సరసంగా, మరియు అత్యంత బహుమానపూర్వకంగా చేయడానికి ఇక్కడ సిద్ధంగా ఉంది. మీరు వేగవంతమైన విహార యాత్ర కోసం బుక్కింగ్ చేయాలని కోరుకున్నా, ధనత్రయోదశికి డిజిటల్ గోల్డ్ కొనుగోలు చేయడానికి లేదా కుటుంబ సభ్యులకు డబ్బులు పంపించడానికి, అమేజాన్ పే క్యాష్ బాక్, డిస్కౌంట్లు మరియు బంపర్ రివార్డ్స్ ను వివిధ శ్రేణులలో అందిస్తోంది. ఈ పండగ సీజన్ లో అమేజాన్ పే నుండి అత్యంత ప్రయోజనాన్ని మీరు ఏ విధంగా పొందవత్తు మరియు ఏవైనా ఆదాలను మీరు కోల్పోకుండా నిర్ధారించవచ్చు. ఆకర్షణీయమైన డిస్కౌంట్లతో ప్రయాణం, డిజిటల్ గోల్డ్‌పై భారీ ఆదాలు, యాప్స్ లో అద్భుతమైన ఆఫర్లు, అమేజాన్ పే లేటర్ యూజర్ల కోసం ప్రత్యేకమైన రివార్డ్స్ తదితర భారీ రైతులు అందిస్తున్నారు.

పోలీస్ సిబ్బందికి వ్యాస రచన పోటీలు నిర్వహణ

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు - 2024లో భాగంగా శుక్రవారంనాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పోలీస్ సిబ్బంది ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశాలపై వ్యాసరచన నిర్వహించారు. మంచి ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నారు. అదనపు ఎస్పీ డాక్టర్ ఓ.దిలీప్ కిరణ్ సమక్షంలో పోటీలను ఎస్ఐ లు ఫ్రక్రుద్దిన్,దినకర్ మరియు డి.సి.ఆర్.బి సిబ్బంది పర్యవేక్షించారు.

నిడగల్లు - జగన్నాధపురం రోడ్డు పనుల ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని నిడగల్లు జగన్నాధపురం గ్రామానికి బీటీ రోడ్డును ఇటీవల ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శంకుస్థాపన చేయడంతో శుక్రవారం నుండి రోడ్డు పనులు ప్రారంభించినట్లు టిడిపి నేత, మాజీ సర్పంచ్ గాజాపు తాతబాబు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డుకు నిధులు మంజూరు చేయించిన ఎంఎల్ఏ విజయ్ చంద్రకు గ్రామస్తులంతా కృతజ్ఞతలు తెలియజేశారు. సంక్రాంతి నాటికి ఆవాసగ్రామం జగన్నాధపురం గ్రామానికి బిటి రోడ్డు వేయడం జరుగుతుందని గుత్తేదారు తెలిపారు.

నూతన ఆదివాసి జేఏసీ సన్నాహక సమావేశం

విశాలాంధ్ర - జీకే వీధి : చింతపల్లి డివిజన్ నూతన ఆదివాసి జేఏసీ ఏర్పాటుకు జికెవివీధి మండలం రింతాడలో చింతపల్లి డివిజన్ ఇంటలెక్చువల్ కమిటీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఆదివాసి జేఏసీ ఏర్పడి సుమారు 8 సంవత్సరాల కాలం అయినందున డివిజన్లో గల మూడు మండలాల పాత కమిటీలను రద్దు చేసి వాటి స్థానంలో నూతన కమిటీలను ఎన్నిక కొరకు విస్తృతంగా మేదో మదనం చేయడం జరిగింది. ఆదివాసి నూతన జేఏసీ ని త్వరలోనే ఏర్పాటు చేయాలని చింతపల్లి డివిజన్ ఇంటలెక్చువల్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ సమావేశంలో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ రామకృష్ణ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.మోహన్రావు, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు యువిగిరి చింతపల్లి మండల అధ్యక్షులు గౌడు గంగరాజు జీకే మండల అధ్యక్షులు పాతును రామరాజు ఉపాధ్యాయులుఎంవీరమణ ముక్కల కామేశ్వరరావు కే పెద్దబ్బాయి ఆర్ వెంకటేశ్వర్లు ఎస్ వినోద్ కుమార్ కే వసంత్ కుమార్ వీరబాబు మర్రి సత్యనారాయణ జీవి రమణ శ్యాంసుందర్ దారబాబు సురేష్ చిరంజీవి కోటి భద్రం పడాల్ సతీష్ భాను జోగన్నపడాల్ భారతి పెద్ద బాలరాజు ఆర్ మోహన్ రావు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులు ఆంధ్ర యూనివర్సిటీ వెబ్సైట్లో పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులు ఆంధ్ర యూనివర్సిటీ వెబ్సైట్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కళాశాలలో చేరిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రతి (మొదటి, ద్వితీయ, తృతీయ) ఒక్కరూ కళాశాల కు వచ్చి ఏబిసిఐడి. అబా ఐడి. జాబ్ పోర్టల్ ఆంధ్ర యూనివర్సిటీ వెబ్సైట్లో పేరు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఇప్పటివరకు 90 శాతం మంది విద్యార్థులు పేరు నమోదు (రిజిస్ట్రేషన్) పూర్తి అయిందని మిగిలిన 10 శాతం విద్యార్థిని, విద్యార్థులు పేరు నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలని ఆమె తెలిపారు. పేరు నమోదుకు ఈనెల 27 ఆఖరు తారీఖున నిర్ణయించడం జరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి విద్యార్థిని, విద్యార్థులు విధిగా కళాశాలకు వచ్చి పేరు నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలని, లేని పక్షంలో వారు పరీక్ష ఫీజు చెల్లించేందుకు, పరీక్షకు హాజరు అయ్యేందుకు అనర్హులవుతారని. అందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఆశ్రమ పాఠశాల బాలికలు

విశాలాంధ్ర - సీతంపేట : నేటినుండి జరగబోవు ఎస్ జి ఎఫ్ స్టేట్ లెవెల్ స్పోర్ట్స్ లో పాల్గొనుటకు సిద్ధమవుతున్న సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు సిద్ధం చేయడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు రాష్ట్ర క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు వివరాలు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నతపాఠశాల సీతంపేట నుండి బాల్ బ్యాట్మెంటన్ అండర్ 17 ఏడుగురుఅండర్ 14 అథ్లెటిక్స్ అండర్ 17 ఇద్దరూ హాకీ అండర్ 17 నలుగురు ఖోఖో అండర్ 17 ఒకరు అండర్ 14 ఇద్దరూ బ్యాట్మెంటన్ అండర్ 17 ఒకరు అండర్ 14 ఒకరు ఆర్చరీ అండర్ 17 ఇద్దరూ అండర్ 14 ఇద్దరూ మొత్తంగా మా పాఠశాల నుండి స్టేట్ లెవెల్ లో అన్ని జిల్లాలలో జరగబోవు ఎస్ జి ఎఫ్ స్టేట్ లెవెల్ స్పోర్ట్స్ కు హాజరవుతున్నారు కోచింగ్ ఇచ్చిన పిడి బి శైలజకు పిఈటి ఎస్ ప్రమీలకు ప్రధానోపాధ్యాయులు, హెచ్ డబ్ల్యు ఓ మరియు ఉపాధ్యాయులందరూ విద్యార్థులను ప్రోత్సహించి క్రీడల్లో పాల్గొని విజయం సాధించాలని తెలిపారు.

పీఎం జన్మన్ గృహ నిర్మాణ పథకం పీవీటీజీలకు వరం

తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ భీమన్న

విశాలాంధ్ర - చింతపల్లి : పీ.ఎం. జన్మన్ గృహ నిర్మాణ పథకం పీవీటిజిలకు వరమని తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ వంతల భీమన్న అన్నారు. తమ్మంగుల పంచాయతీ వర్తనపల్లి గ్రామంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ కె.రమణ బాబుతో కలసి వర్తనపల్లి గ్రామంలో పివిటిజి లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ తమ్మంగుల పంచాయితీలో పీఎం జన్మన్ గృహాలు 126 మంజూరు అయ్యాయని, వాటిలో 50 బేస్మెంట్ స్థాయిలోనూ 8 లింటల్ స్థాయిలోనూ ఉన్నాయన్నారు. ఈ పథకం ద్వారా (పీఎం జన్మన్) వి.వి.టి.జి.లకు సొంతిల్లు కలను ఎన్డీఏ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. దీంతో పంచాయతీలోని వర్తనపల్లి గ్రామంలోని గృహ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గృహలబ్ధిదారులు పాల్గొన్నారు.

రవికిరణ్ మృతికి కారకుడైన వైస్ ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ముంచంగిపుట్టు : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలో గల జోలాపుట్టు పంచాయితీ పోలిపుట్ గ్రామానికి చెందిన బోడ్నాయక్ ఈశ్వర్ నీలమ్మ దంపతుల కుమారుడు రవికిరణ్ మృతికి కారకుడైన అరకు గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కొర్రా త్రినాథ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అరుకువేలిలో గల ఏపీఆర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రవికిరణ్ పై గత వారం రోజుల క్రితం అకారణంగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ భౌతిక దాడి చేశారన్నారు. విద్యార్థి శరీరంపై బలమైన గాయాలు కావడంతో స్పృహ తప్పిపోయి పడిపోయినట్లు తెలుసుకొన్న రవికిరణ్ తల్లి తండ్రులకు పాఠశాలకు వెల్లి వైస్ ప్రిన్సిపాల్ ను గట్టిగా నిలదీసారని, అరుకు ఆసుపత్రిలో వైద్యం అందించి కొన్ని రోజుల మీ ఇంటికి తీసుకుని వెళ్ళమని చెప్పడంతో తల్లిదండ్రులు ఇంటికి తీసుకుని వచ్చారని అన్నారు. కుమారుడు మరణించడంతో నిరుపేద తల్లితండ్రుల తల్లడిల్లీ పోతున్నారని, కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి మృతికి కారణమైన వైస్ ప్రిన్సిపాల్ ను కఠినంగా శిక్షించాలని, విద్యార్థి కుటుంబానికి ఉద్యోగ ఉపాధి కల్పించాలని, 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు, లేని పక్షంలో విద్యార్థి తల్లితండ్రులు, కుటుంబ సభ్యులతో అరకు ఏపీఆర్ పాఠశాల ఎదుట ఆందోళన చేపడతామని లక్ష్మిపురం సర్పంచ్ త్రినాథ్ హెచ్చరించారు.